## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణ



ప్రత్యేక అలంకరణలో అంజనేయస్వామి

**ఎంవీపీకాలనీ:** సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాన్ని ఎంవీపీ కాలనీ సెక్టార్-6 లోని భద్రం పార్కులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. త్వరలో నిర్వహించనున్న కోటి సార్లు హనుమాన్ చాలీసా పారాయణ, శ్రీరామనామ లిఖిత మహాయజ్ఞంలో భాగంగా శనివారం 108 సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. శ్రీ అభయాంజనేయ సువర్చల పీఠం వ్యవస్థాపకులు మారుతి, వారి బృందం భక్తుల చేత హనుమాన్ చాలీసా పారాయణం చేయించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు.

### ఉల్లాసంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న మేఘశ్యామ్

**బీచ్‌రోడ్డు:** అంతర్జాతీయ సంతోష వారోత్సవాల్లో భాగంగా టింపనీ స్కూల్ ఆధ్వర్యంలో గ్లీ-ఎ-థాన్ పేరుతో నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. శనివారం ఆర్కే బీచ్ నుంచి ఎంవీపీ కాలనీ వరకు సాగిన ఈ వాకథాన్‌ను ప్రముఖ క్రీడాకారుడు బి.మేఘశ్యామ్ జెండా ఊపి, ప్రారంభించారు. ఈ వాకథాన్‌లో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యాక్స్ గ్రూప్ సీఈవో సంతోష్ జ్ఞానకన్, సునీల్ మక్వానే, నళినీ నెల్సన్, వందనా ఆనంద్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

### పోలమాంబ హుండీ ఆదాయం రూ.12.39 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

**ఏయూక్యాంపస్:** శ్రీ కరకచెట్టు పోలమాంబ ఆలయం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా పర్యవేక్షణలో పర్యవేక్షణ అధికారి ప్రసన్నలక్ష్మి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 131 రోజులకు గాను రూ 12,39,788 ఆదాయం హుండీల ద్వారా వచ్చింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.శంకర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు సుదర్శనం సత్య శ్రీనివాసాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం పెద్దలు పాల్గొన్నారు.

### ఘనంగా అన్నమాచార్యుల శోభాయాత్ర



శోభాయాత్రను ప్రారంభిస్తున్న పేడాడ రమణికుమారి

**బీచ్‌రోడ్డు:** తాళ్లపాక అన్నమచార్యులు 520వ వర్ధంతి సందర్భంగా శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాగరతీరంలో శోభా యాత్ర నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి అన్నమయ్య విగ్రహం వరకు సంకీర్తనలు, కోలాటాలతో సాగిన ఈ శోభాయాత్రను వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



## ఏయూ సమాచారమ్

# కోర్సు మెటీరియల్ ఆవిష్కరణ

20 నుంచి ఫీల్డ్ సెమినార్



కోర్సు మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూక్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డెల్టా స్టడీస్ ఆధ్వర్యంలో నూతనంగా తీర్చిదిద్దిన 'మోడరన్ అండ్ ఏన్షియంట్ డెల్టా సిస్టమ్స్-ఏ ఫీల్డ్ సెమినార్'కోర్సు మెటీరియల్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి శనివారం తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కె.ఎస్.ఎన్. రెడ్డి, కోర్సు డైరెక్టర్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు పాల్గొన్నారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు నాలుగు రోజులు ఫీల్డ్ సెమినార్‌ను డెల్టా స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కెర్న్ ఆయిల్, గ్యాస్, వేదాంత లిమిటెడ్ సంస్థల్లో పనిచేస్తున్న 18 మంది అధికారులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలియజేశారు.

## పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య వృద్ధి



సునీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

**ఏయూక్యాంపస్:** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలని జాజి టెక్నాలజీస్ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.సునీల్ కుమార్ అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులను ఉద్దేశించి శనివారం ఆయన ప్రత్యేక ప్రసంగం అందించారు. విద్యార్థి దశలో సముపార్జించిన జ్ఞానం భవిష్యత్తులో ఉత్పత్తి, మేనేజ్‌మెంట్, సర్వీస్, మార్కెటింగ్, ఫైనాన్స్, ఎనర్జీ రంగాలలో ఉపాధి అవకాశాలు పొందేలా డీసీఎంఎస్ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. బిజినెస్ ఎనలిటిక్స్ సాఫ్ట్‌వేర్‌ను నేర్చుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. వ్యాపార రంగంలో ఉన్న విభిన్న అవకాశాలను వివరిస్తూ, వాటిని పొందడానికి అవసరమైన సామర్థ్యాలు తెలియజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, పోతిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ బి.సుబ్బయ్య, ఆచార్య ప్రభాకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆధునికీకరించిన సమావేశ మందిరం ప్రారంభం



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య శ్యామల, చిత్రంలో వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూక్యాంపస్:** విద్యార్థులు కష్టపడే తత్వాన్ని ఇష్టపడాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో వర్సిటీ పూర్వ విద్యార్థి, అమెరికాలో ఫార్మా కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న దేవ పురాణం తన సొంత నిధులతో ఆధునీకరించి అందించిన సమావేశ మందిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు నిజమైన హీరోలు, స్ఫూర్తి ప్రదాతలుగా తల్లిదండ్రులు నిలుస్తారన్నారు. విద్యార్థులు దేవ పురాణంను ఆదర్శంగా తీసుకుని, అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు. దేవ పురాణం మాట్లాడుతూ తన అభివృద్ధికి కారణమైన మూలాలను తాను మరువలేదన్నారు. వర్సిటీ తనకిచ్చిన ఒక గొప్ప అవకాశంగా దీనిని భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్‌కిశోర్ బాబు, విభాగాధిపతి ఆచార్య శ్యామల తదితరులు ప్రసంగించారు. సమావేశ మందిరం శిలాఫలకాన్ని విద్యార్థులతో, సమావేశ మందిరాన్ని దేవపురాణం, ఆచార్య శ్యామలతో ఆవిష్కరింపచేశారు.

## యువతతోనే భారతావని అభివృద్ధి సాకారం



సదస్సు సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి

**ఏయూక్యాంపస్:** భారతావని అభివృద్ధి యువతతోనే సాకారం అవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. శనివారం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. నేటి తరానికి అవసరమైన స్ఫూర్తిని అందించే బాధ్యతను ఆచార్యులు స్వీకరించాలని సూచించారు. ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్లిష్ట పరిస్థితుల నుంచి నూతన ఆవిష్కరణలు వస్తాయన్నారు. నిరంతర పరిశోధనలు జరగాలని సూచించారు. ఆలోచనలకు పునాదిగా సదస్సులు నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నించడంతోనే ప్రగతి సాధ్యపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, విభాగాధిపతి ఆచార్య కె.రాంజీ, బి.ఆర్.ఎల్. ఐశ్వర్య తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆవిష్కరించారు. వర్సిటీ తరఫున ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావును సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.

# పూర్తిస్థాయి అధ్యయన కేంద్రంగా 'గాజువాక ఇగ్నో'

**ఎంవీపీకాలనీ:** గాజువాకలోని ఎంవీఆర్ కళాశాలలోని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) అధ్యయన కేంద్రాన్ని పూర్తిస్థాయి అధ్యయన కేంద్రంగా మార్చినట్లు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు అందజేసినట్లు ప్రకటనలో తెలిపారు. ఎంవీఆర్ కళాశాలలో ఇప్పటి వరకు ఇగ్నో ప్రత్యేక అధ్యయన కేంద్రం నిర్వహించిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం, విద్యాపరమైన అవసరాల నేపథ్యంలో ఆ కేంద్రాన్ని పూర్తిస్థాయి అధ్యయన కేంద్రంగా మారుస్తూ ఆ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావుకు ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. దీనివల్ల మరిన్ని పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మనపాలెం, దువ్వాడ విద్యార్థులకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో సహాయ రిజిస్ట్రార్ లక్ష్మీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోరుతూ విద్యార్థులు పనిచేయాలి



నృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**ఏయూక్యాంపస్:** సమాజ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు పని చేయాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమాన్ని రెక్టార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య సమత మాట్లాడుతూ నైతికత, విలువలను నిరంతరం పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా నిరంతరం పని చేస్తున్నామని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు.సి విల్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీరింగ్ విద్యకు తల్లివంటిదన్నారు. విభాగ విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను నిత్యం నైపుణ్యంతో తీర్చిదిద్దుతున్న విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో కుమార్‌రాజ ప్రాజెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కె.కుమార్‌రాజ, కెల్లర్ ఇండియా సంస్థ ఎండీ వై.హరికృష్ణ, విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి. సత్యనారాయణరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా సివిల్ ఇంజినీరింగ్‌లో ప్రతిభ చూపిన పి.ప్రవల్లికకు బంగారు పతకం బహూకరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి. ప్రజాదరణ పొందిన సినీ గీతాలకు విద్యార్థులు నర్తించి అలరించారు.

# యువతే దేశానికి వెన్నెముక



యువ సదస్సులో ప్రసంగిస్తున్న కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయ

**మద్దిలపాలెం:** యువతే దేశ ప్రగతికి వెన్నెముకగా నిలుస్తుందని డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కళాశాలలో శనివారం నిర్వహించిన యువ సదస్సులో ఆమె మాట్లాడారు. భారతదేశం సుసంపన్నమైందని, యువత సమర్థవంతంగా పని చేస్తే, దేశం ప్రగతిపథంలో నడుస్తుందన్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి ఎండీ షఫీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపడుతున్న పథకాల గురించి వివరించారు. యువ దర్శకుడు ఆకిరి సురేష్ మాట్లాడుతూ యువత ప్రధాన అంశంగా చిత్రాలు వస్తున్నాయని, వాటిలో మంచిని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, జర్నలిస్టు ఎస్ఎస్ఆర్, నేషనల్ అవార్డు గ్రహీత లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టీం ఇండియాకు శుభాకాంక్షలు



టీం ఇండియాకు ఆల్ ద బెస్ట్ చెబుతున్న విభిన్న ప్రతిభావంతులు

**ఎంవీపీకాలనీ:** భారత క్రికెట్ టీం కోచ్ రాహుల్ ద్రావిడ్ సారథ్యంలో టీం ఇండియా విజయం సాధించాలని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులు ఆకాంక్షించారు. విశాఖలో టీం ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా వన్‌డే మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో గురువారం టీం సభ్యులకు ఆల్ ద బెస్ట్ చెబుతూ ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలి దరి పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గతంలో విశాఖ పర్యటనలో భాగంగా రాహుల్ ద్రావిడ్ తమ పాఠశాలకు వచ్చి గడిపిన మధుర క్షణాలను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. వాతావరణం ఆటంకం లేకుండా మ్యాచ్ జరగాలని, ఈ మ్యాచ్ ద్వారా ఈ సిరీస్‌లో టీం ఇండియా 2వ వన్ డే విజయం సాధించాలని విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కండిపిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## పార్కు రక్షణకు పటిష్ట చర్యలు



భద్రతా సిబ్బందితో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

సాక్షి ఎఫెక్ట్..

**ఏయూక్యాంపస్:** వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల శనివారం ఉదయం బీచ్ రోడ్డులోని స్మార్ట్ సిటీ పార్క్‌ను సందర్శించారు. శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'వీఎంఆర్‌డీఏ పార్క్‌లో మందు పార్టీలు' వార్తకు స్పందించారు. పార్క్‌ను తనిఖీ చేశారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బందితో మాట్లాడారు. ఆకతాయి మూకలను కట్టడి చేయాలని సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందికి స్పష్టం చేశారు. పార్క్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. సంస్థ ఉద్యోగులు, భద్రతా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

# నిరంతర అధ్యయనం అవసరం



ఎన్‌వీపీ న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

**విశాఖ, లీగల్ :** న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టులో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.

## రేపటి నుంచి సాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు

**ఆరిలోవ:** జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 20న ప్రారంభం కానున్నాయి. ఉగాది వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా 20న ఉదయం నుంచి స్వామికి పూజలు జరిపించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 21న 108 కలశాలతో అభిషేకం, 22న సామూహిక సత్యవ్రతాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

# సేవల ద్వారా ప్రజల మన్ననలు పొందాలి

అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచన



రేసపువానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మద్దిలపాలెం :** అలక్ష్యం లేకుండా వైద్య సేవలందించాలని అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెంలో గల హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న తీరుపై ఆరా తీశారు. అలాగే ఫార్మసీ విభాగం, ఇ-షేషెంట్ వార్డు, ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఓపీ నమోదు చేస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్దేశించిన ప్రతి వైద్య పరీక్ష చేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సేవలందించాలన్నారు. స్పెషలిస్టుల సేవల గురించి ఆరా తీశారు. ప్రత్యేక వైద్యసేవల గురించి తెలిసేలా క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఏ రోజు ఏ వైద్య నిపుణుడు హెల్త్ సెంటర్‌లో సేవలందించేదీ ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. చిత్తశుద్ధితో సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు.

## క్రియేటివ్ ఫర్నిషింగ్ స్టూడియో ప్రారంభం

**మద్దిలపాలెం :** క్రియేటివ్ ఫర్నిషింగ్ స్టూడియోను మద్దిలపాలెంలో శనివారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వాతి ప్రమోటర్స్ ఎండీ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 20వ తేదీ వరకూ 20 శాతం డిస్కౌంట్ అందుబాటులో వుందని స్టూడియో అధినేత శికాకులపు సురేష్ తెలిపారు.

# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి



ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మద్దిలపాలెం :** ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు తొలగించాలని, విధిగా ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు అన్నారు. శనివారం నగరంలో పలు ప్రాంతాలలో విస్తృతంగా పరిశీలించారు. నీటి నిల్వలు తొలగించే ప్రక్రియను స్వయంగా డీఎంహెచ్‌వో నివాసితులకు వివరించారు. వారం పైబడి నీటి నిల్వలు పేరుకుపోవడం వలన దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా మారుతాయన్నారు. దీని ద్వారా మలేరియా, డెంగ్యూ డీఎంహెచ్‌వోతో పాటు మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంపొందించాలి



పట్టాలందుకున్న చిన్నారి గ్రాడ్యుయేట్లు

**మద్దిలపాలెం :** చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంపొందించేందుకు ఆధునిక పద్ధతులు అవలంబించాలని ఏయూ విశ్రాంత రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం సంస్కృతి గ్లోబల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన చిన్నారి గ్రాడ్యుయేట్లకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా స్కూల్ చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శలు ఆకట్టుకున్నాయి.

# అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులుకు చెక్కు అందజేస్తున్న దాత రమణారెడ్డి

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని ఆర్కే బీచ్ ప్రాంతానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే దాత లక్షా 1116 విరాళంగా ఇచ్చారు. ఆలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు సంబంధిత చెక్కు అందజేశారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన చైతన్య కృష్ణతేజ అనే దాత రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో పీఆర్వో సునీల్‌కు చెక్కురూపంలో అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించారు.

## ఘనంగా సేవ గరిడీ



సేవ గరిడీలో పాల్గొన్న అక్కరమాని వెంకటరావు, మొల్లి అప్పారావు

**మద్దిలపాలెం:** పాత వెంకోజీపాలెంలోని రాధాకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం సేవగరిడీ పాలగొలుపును ఘనంగా నిర్వహించారు. అచ్చుపూత కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు, గొలగాని కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## మేయర్‌కు సత్కారం



15వ వార్డు కార్పొరేటర్ శ్రీవిద్యను సత్కరిస్తున్న మేయర్

**మద్దిలపాలెం :** మహా నగరపాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య దంపతులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్పొరేటర్‌గా రెండేళ్లు పూర్తి చేసుకున్న కార్పొరేటర్ శ్రీవిద్యను మేయర్ శాలువ కప్పి సత్కరించారు.

# బిల్డింగ్‌పై నుంచి పడి పెయింటర్ మృతి



భాస్కర్ మృతదేహం

**సింహాచలం:** బిల్డింగ్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి పెయింటర్ మృతి చెందాడు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రామాటాకీస్ సమీపంలోని రేసపువానిపాలెంలో ఉంటున్న ఎం.భాస్కర్(43) శ్రీనివాసనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవన పెయింటింగ్ పనులకు వచ్చాడు. శనివారం ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. వెంటనే అతన్ని అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ

**విశాఖ విద్య:** ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు శ్రద్ధ తీసుకుంటున్నట్లు సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తెలిపారు. పెందుర్తి భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని తెలియజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో చదువుతో ఆరోగ్య పరమైన సేవలు అందిస్తామన్నారు.

# ఘనంగా అన్నమయ్య వర్ధంతి



సప్తగిరి సంకీర్తన సమ్మేళనంలో పాల్గొన్న కళాకారులు

**మద్దిలపాలెం :** అన్నమయ్య 520వ వర్ధంతిని త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య చిత్ర పటానికి ట్రస్ట్ ప్రతినిధుల ఎమ్మెస్ రాజు, డాక్టర్ గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాకారులతో కలిసి చైతన్య సోదరులు వీనులవిందుగా సంకీర్తన సమ్మేళనం నిర్వహించారు. వయొలిన్‌తో మాస్ శర్మ సహకారం అందించారు.